


# విరామం

## - అంగర వేంకట కృష్ణారావు



*1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.*

*పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.*

*ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.*

**అంగర వెంకట కృష్ణారావు**

*ఒక చిన్న మాట!*

*ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.*

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

విజయవాడ, 24-1-1970

*(గత సంచిక తరువాయి)*

## 14

పూజ రోజులు గడిచిపోయిన తరవాత చిట్టగాంగు తిరిగి యథాప్రకారం తయారైంది.

తూర్పు రంగంలో యుద్ధం మరీ జోరందుకుంది. ముందుకి చొచ్చుకొచ్చిన జపాన్ సైన్యాల్ని మిత్రమండలి బలాలు వెనక్కి నెట్టుతున్నాయి. కొన్నిచోట్ల వాళ్ళు, కొన్నిచోట్ల వీళ్ళు, ముందడుగు వేస్తున్నారు. ఈ తోపులాటలో మిత్రమండలి సైనిక దళాలు కొన్ని బర్మా కీకారణ్యాల్లో ముందు వెనక కూడా శత్రు సైన్యాలలో చిక్కు పడిపోయేయి. వాళ్ళకి ఆయుధాలు లేవు. కనీసం రేషన్లయినా లేకపోతే శత్రువుల వల్ల కాకపోయినా, ఆకలివల్ల మాడి చస్తారు.

అక్కడ చెరువులున్నాయి. కాని చాలా చెరువుల్లో శత్రువులు విషం కలిపారు. అలిసి సొలిసిన ఆ నిర్భాగ్యులకి అక్కడా అక్కడా సిగరెట్లు, రేషన్లు పడి దొరికేవి. కాని ఆ సిగరెట్లు కాల్చినా, రేషన్లు తిన్నా చావు తప్పదు. ఈ వుచ్చులో చిక్కుకున్న సైనికులందరూ పాపం కటకట లాడిపోయారు. అప్పుడే "ఎయిర్ సప్లై కోర్" పని పడింది. ఈ సిబ్బంది విమానాల మీద రేషను తీసుకెళ్ళి చిక్కుపడిన సైనిక స్థావరాలు గుర్తుచూసుకుని గిరాటువేస్తారు. కాని యిందులో యిబ్బంది వుంది. విమానం శత్రు శతఘ్నుల దెబ్బతప్పించుకుని, గుర్తుకనిపెట్టి, అదను కనిపెట్టి, సాధ్యమైనంత కిందికి దిగి రేషను పార్సెళ్లు దిగ విడిచి, వెంటనే పైకెగసి దెబ్బలు తప్పించుకుంటూ తిరిగిరావాలి. ఈ ప్రయత్నంలో అటు విమానాలు, యిటు రేషన్లు కూడా ధ్వంసం అవుతూండేవి.

## 15

రంగూన్ ట్రేడింగు కో సేన్ నన్ను చాలా సార్లు వాళ్ళ పల్లెకి రమ్మని ఆహ్వానించేడు. పల్లె పేరు "సీతాకుండి". కాని తీరిక లేక నేనే వెళ్ళలేదు. అక్కడ వాళ్ళకి తోటలు, దొడ్లు చాలా వున్నాయి.

"రావ్! ఇవాళ రాత్రి నేను సీతాకుండీ వెళుతున్నా. నువ్వు కూడా రాకూడదా. రేపు సాయంత్రం తిరిగి వచ్చేద్దాం..."

"ఈ సారికాదు. రేపు నన్ను కొందరు మిలిట్రీ మిత్రులు విందుకి ఆహ్వానించేరు..."

"సీతాకుండీ ఎంతో చల్లని ప్రశాంతమైన ప్రదేశం. అక్కడ గుట్ట మీద "చంద్రనాథ్" దేవాలయం వుంది. నీలాటివారు చూడవలసిన విశేషాలెన్నో వున్నాయి".

"మీకక్కడ చాలా సిబ్బంది వుందనుకుంటా..."

"చాలాకాదు. ఒక మేనేజరున్నాడు కుటుంబంతో సహా. అతను మాకు దూరపు బంధువే. నమ్మకస్తుడు. తరచు మా నాన్నగారక్కడే వుంటున్నారు. మా పినతండ్రి కూతుర్ని కూడా ఈ మధ్య అక్కడే పెట్టేం. ఆ అమ్మాయికి కాస్త మతి చలించింది. వాళ్ళకి కుటుంబ సంబంధమైన కొన్ని యిబ్బందులు కూడా వచ్చాయి. దానాదీనా పట్నవాసం కన్నా ఆ చల్లటి పల్లెటూరే బాగుంటుందనిపించింది. పిల్ల నాకు అక్క అవుతుంది. కాని నాకంటే కొన్ని నెలలే పెద్ద..."

"అసలు వాళ్ళిక్కడే వుండేవారా?"

"ఉహుఁ. కొమిల్లాలో. మా పినతండ్రి ఈ మధ్యే పోయాడు. "

యూనిట్టుకి తిరిగొస్తుంటే యేవో లెక్కలేనన్ని ఆలోచనలు సముద్ర కెరటాల్లా లేచేయి.

16

కొన్నాళ్ళ తరవాత నాకు "అపెండిసైటిసు" జబ్బు చేసింది. మొదట్లో అశ్రద్ధ చెయ్యటం వల్ల అది త్వరగా ముదిరిపోయింది. నేను ఆస్పత్రిలో చేరా. చిట్టగాంగులో "అడ్వాన్సు బేసు ఆస్పత్రి" వుంది. అక్కడకి రోజూ క్షతగ్రాతులు యుద్ధరంగం నించి వస్తున్నారు. వాళ్ళుగాక అత్యవసరమైన కేసులెన్నో వస్తున్నాయి. నాక్కూడా శస్త్ర చికిత్స చెయ్యాలి కాని నాది మామూలు కేసు. అంచేత నన్ను ఢాకాలో బేస్ ఆస్పత్రికి బదలాయించేరు.

నేను ప్రయాణం చేసిన అంబులెన్స్ రైలు చాలా సదుపాయంగా వుంది. అందులో రోగులందర్నీ అతి జాగ్రత్తగా చూస్తారు. ఆ రైలు ప్రయాణానికి ఎక్కడా ఏ పరిస్థితిల్లోనూ అంతరాయం కలక్కూడదు. అన్ని రైళ్ళూ దానికి తోవయిచ్చేయ వలసిందే.

రైల్లో ప్రవేశించగానే డాక్టరూ, మేట్రన్ వచ్చి ప్రతి కేసూ చూసి రోగం, రోగి పరిస్థితి తెలుసుకుంటారు. ప్రమాద స్థితిలో వున్న కేసుల్ని ప్రత్యేక శ్రద్ధతో చూస్తారు. ఆ రైల్లో మెడికల్ నర్సింగు సిబ్బంది అంతా తెల్లవాళ్ళు, ఆంగ్లో ఇండియన్లే వున్నారు.

ఆ రైల్లో, ఆస్పత్రిలో వున్న అన్ని సదుపాయాలూ వున్నాయి. గ్రామఫోను, సంగీతం, లైబ్రరీ సదుపాయం కూడా వున్నాయి. కాఫీ, టీ, కోకో, ఓవల్టిన్ ఏదో ఒకటి గంట గంటకి తెచ్చి యిస్తారు. చేతులకి దెబ్బలు తగిలి కట్లతో వున్న రోగుల పక్క నర్సులు నిలబడి వాళ్ళచేత సిగరెట్లు కాల్పిస్తారు.

మేట్రన్ సుమారు యాభై యేళ్ళ దొరసాని. తెల్లటి డ్రస్సులో తెల్లగా గోవులా వుంటుంది. రోగుల్ని చిరునవ్వుతో తల్లిలా సమీపిస్తుంది. అతి మృదువుగా మాట్లాడుతుంది. ఆమె నా దగ్గరికి రాగానే లేచి కూచోబోయాను.

"ఒద్దు దయచేసి అలా పడుకో! నీచేత నిమ్మళంగా ఈ పాలు తాగిస్తా..." చిరునవ్వుతో అంది.

"ఫరవాలేదు, సిస్టర్. నాదంత సీరియస్ కేసు కాదు. అపెండి సైటిస్ ఆపరేషనుకి వెళ్తున్నా... అని నే కూచున్నా.

"అయితే యిది తాగు..."

''క్షమించు సిస్టర్. నాకు పాలు సయించవు"

"నాకు తెలుసు. ఇవి తాజాపాలు కావు అయినా యివి. మంచి పాలు. చూడు నీకు రొట్టె, పాలే ఆహారం..."

"క్షమించు, నేను పాలు తాగలేను".

"పోనీ ఓవల్ టైన్ తాగుతావా?"

“సరే. ఓవల్ టైన్"

ఓవల్ టైన్ తాగా. ఆవిడ నా జబ్బు గురించి, ఉద్యోగం గురించి, యింకా కుటుంబం గురించి కనుక్కుంది.

“మరేం భయపడకు. అపెండి సైటిస్ సాధారణంగా యేమంత ప్రమాదకరం కాదు. ఆపరేషను చేస్తారు. నీకు కులాసాగా వుంటుంది...”

“నాకేం భయంలేదు సిస్టర్...”

ఆమె చిరునవ్వుతో లేచింది, నేను గుడ్ నైట్ చెప్పి సాగోరేను. రైలాగకుండా వెళ్ళిపోతూంది.

ఢాకా ఆస్పత్రిలో చేరగానే నన్ను తిరిగి తనిఖీ చేశారు. ఆపరేషను చెయ్యడానికి A–1 వార్డులో చేర్చేరు. ఆ గదిలో రెండే మంచాలున్నాయి. గది చాలా పెద్దది. నిశ్శబ్దంగానే వుంది.

రెండో మంచం మీద రోగికి అంతకు ముందే ఏదో ఆపరేషను అయిపోయింది. పైజామా చొక్కాతో పడుకున్నాడు.

నన్ను మంచం దగ్గిరకొక ఆంగ్లో ఇండియన్ నర్సు తీసుకెళ్ళింది. ఆవిడ పేరు హెలెన్. తెల్లగా పొడుగ్గా వుంది. చాలా అందకత్తె. నిమ్మళంగా మాట్లాడుతుంది. మాట వినిపించడమే కష్టం. ఆ పెద్ద కళ్ళలో ఆకర్షణ శక్తి వుంది. ఆమె నా కేసు హిస్టరీ కాయితాలన్నీ గుచ్చెత్తి, సూది, దారంతో ఒక మూల కుట్టింది. సూది ఆమె చేతిలో సున్నితమైన పువ్వులా తోచింది. ఆమె వేళ్ళు పొడుగాటి తెల్ల చిక్కుడు కాయల్లా వున్నాయి.

ఆమె అక్కడ వుండగానే ఒక మగ మేజరు, ఆడ కెప్టెను వచ్చారు. నా కాయితాలు చూశారు. నన్ను తిరిగి తనిఖీ చేశారు. మేజర్ బ్లిన్, కెప్టెన్ రూద్ యేదో గుసగుసలాడుకొన్నారు. ఇద్దరూ తెల్లవాళ్ళే.

“నీకు రేపు ఆపరేషను, ఏం భయంలేదు” అన్నాడు మేజర్ బ్లిన్.

నేను చిరునవ్వు నవ్వాను. వాళ్ళు నర్సుకి చెప్పవలసినవన్నీ చెప్పి వెళ్ళిపోయారు. తరువాత మేట్రనొచ్చి నన్ను పలకరించి వెళ్ళిపోయింది. హెలెన్ అవతలికెళ్ళి పన్లు చక్కబెట్టుకొని తిరిగివచ్చి నా మంచం పక్క స్టూలు మీద కూచుంది. చీకటైంది. లైట్లు వెలిగేయి.

“సిస్టర్, దయచేసి సిగరెట్ తీసుకో...” అన్నాను.

ఆమె “థ్యాంక్సు” చెప్పి తీసుకుంది. ఇద్దరం సిగరెట్లు ముట్టించాం.

“నా ఆపరేషను చాలా సేపవుతుందా?”

“ఉహు... మహా అయితే అరగంట...”

“మత్తుమందిస్తారా?”

“తప్పకుండా...భయంగా వుందా?”

“అబ్బేబ్బే... నేనిదివరకెప్పుడూ ఏ ఆపరేషనూ చేయించుకోలేదు.”

"ఏం పరవాలేదు"

ఇలా మేం మాట్లాడుతూంటే నైటు డ్యూటీ నర్సొచ్చింది. ఆమె కూడా ఆంగ్లో ఇండియనే. పేరు షీలా. ఇరవై నాలుగేళ్ళుంటాయి. కొంచెం పొట్టి. చకచక నడుస్తుంది. నడుస్తూనే రోగుల్ని పలకరిస్తుంది. పలకరిస్తూనే పాటలు విసురుతుంది.

షీలా చకచకా నా దగ్గరకొచ్చింది. "గుడీవినింగ్. హౌ ఆర్ యూ" అంటూనే నా పెట్టెలో ఒక సిగరెట్లు తీసుకుంది. నా నోట్లో ఒక సిగరెట్టు పెట్టి. తనదీ నాదీ తనే ముట్టించింది.

ఏడు గంటలకి హెలెన్ వార్డంతా షీలాకి అప్పజెప్పి వెళ్ళిపోయింది. షీలా తొమ్మిదింటికి రోగులందరికి మందులిచ్చి, పెద్దదీపాలు ఆర్పి, చిన్న లైట్లు వెలిగించి, డ్యూటీ నర్సుండే గదిలోకి వెళ్ళిపోయింది.

మర్నాడుదయం పదకొండు గంటలకి నన్ను థియేటరులోకి తీసుకెళ్ళారు. ఆపరేషను బల్లమీద ఒక పక్కకి కాళ్ళు వేలేసి కూచున్నా. మేజర్ బ్లిన్ ఎదురుగా నిల్చుని చిరునవ్వు నవ్వేడు. నన్నేమో కుశల ప్రశ్నలు వేశాడు.

"నీకొక చిన్న ఇంజక్షనిస్తాం. భయపడకు"

నేనతని వేపదోలా చూశా. అతను నన్ను ముందుకువంచి, నా తల తన కుడి చంకలో యిరికించుకున్నాడు. వెనకనించి కెప్టెన్ రూద్ నా వెన్నులోకి ఇంజక్షనిచ్చింది. మేజరు నన్ను ఒదిలి పెట్టి, "అయిపోయిం "దన్నాడు. మళ్ళీ కొన్ని కుశల ప్రశ్నలు వేశాడు. ఐదు నిమిషాలు తరవాత నన్ను కాళ్ళు తీసుకుని బల్లమీద పడుకోమన్నాడు. నాకు కాళ్ళు రాలేదు. మేజర్ నవ్వి, నా కాళ్ళు బల్లమీద పెట్టేడు. నా మొహంమీద ఒక గుడ్డ కప్పేరు.

మేజరు నన్ను మాట్లాడిస్తూనే వున్నాడు. కత్తి తన పని చేసుకుపోతూంది. ఆపరేషను కెప్టెను రూద్ చేసింది. అరగంటైందేమో. తిరిగి నన్ను వార్డులో చేర్చేరు. పగటి నర్సు నాకొక ఇంజక్షనిచ్చింది. నాకు నిద్రపట్టింది.

సాయంత్రం నాలుగ్గంటలకి నాకు బాగా తెలివొచ్చింది. నర్సు నా చేత కాఫీ తాగించింది. మూడు వారాలు అలాగే పడుకోవాలంది.

వారం రోజులు తరువాత నన్ను పక్కగదిలోకి బదిలీ చేసేరు. అది A-2 వార్డు గది. దాంట్లో ఆరుమంచాలున్నాయి. అన్నీ పెద్ద ఆపరేషను కేసులే.

నా పక్క మంచంమీద "సాంవరియా" అనే అతనున్నాడు. ఇరవై రెండేళ్ళవాడు. అతని కడుపులో తుపాకీ గుళ్ళుండి పోయేయిట. శస్త్ర చికిత్స చేసి తీసేశారు. కాని పెద్ద పేగు లాంటిదేదో రెండు మూడంగుళాలు బైటకొచ్చింది. కట్టు విప్పితే ఆ గాయం చూడ్డానికి భయంకరంగా వుంది.

సాంవరియా ఐదు నెలల్నించీ అలాగే వున్నాట్ట. బహుళ ప్రమాదమైన కేసు. పెద్ద డాక్టర్ కల్నల్ రాస్ రోజూ వచ్చి అతన్ని చూస్తున్నారు.

"హల్లో మైడియర్ సాంవరియా! ఎలావున్నావివాళ?" అని పెద్ద డాక్టర్లు పలకరించేవారు. సాంవరియా నీరసంగా నవ్వేవాడు. కల్నల్ లో లెఫ్టినెంటు మీనా అనే యువ డాక్టరు వచ్చేది. ఆమె సాంవరియాకు ఫ్రయిడ్ ఎగ్, గ్లూకోజ్ కలిపిన పెరుగు యింకా పుష్టికరమైన ఆహారం స్వయంగా తినిపించేది. అప్పుడప్పుడు వెనక్కు తిప్పిన కల్నలు మొహంలో విషాదం గోచరించేది.

"""ఇది నిజంగా నెగ్గే కేసుకాదు. పాపం అతను మరణంతో యుద్ధం చేస్తున్నాడు. మన శక్తి మేరకి ప్రయత్నించి ఫలితం దేవుడికి విడిచి పెట్టేద్దాం..." ఓనాడు కల్నలు లెఫ్టినెంటు మీనాతో అంటూంటే నా చెవిని పడింది.

నా ఆలోచనలు పరిగెత్తేయి. సాంవరియా ఎక్కడివాడు? అతని స్వగ్రామం అక్కడికెన్ని వేల మైళ్ళ దూరంలో వుంది? ఎక్కడి స్వగ్రామం, ఎక్కడ ఢాకా! అతనికి పెళ్ళయిందో లేదో తెలీదు. కాని తల్లి బతికే వుంటుంది. ఆమె యిప్పుడు తన కొడుకెలా వున్నాడనుకుంటూంది.

యుద్ధ రంగంలో, అడవిలో, కొండకోనల్లో, శత్రువుల గుండు దెబ్బకి ఆహుతై ఒక సిపాయి పడిపోతే చచ్చిపోతే ఎక్కడో వున్న తల్లి పేగు కదుల్తుంది. ఇల్లాలి గుండె అదురుతుంది. తల్లిస్తన్యం గుడుస్తున్న అతని బిడ్డ కెవ్వుమంటుంది. నీటికంటె చిక్కనైనది నెత్తురు.

ఒక రాత్రి పదిగంటలకి సాంవరియా శాశ్వతంగా కన్నుమూశాడు. కల్నల్ రాస్, లెఫ్టినెంట్ మీనా వచ్చేరు. రాస్ నడ్డి మీద చేతులేసుకుని సాంవరియా కళేబరంవేపు కదలకుండా, రెప్ప వాల్చకుండా ఐదు నిమిషాలు చూశాడు. మీనా బుగ్గల మీంచి కన్నీరు పాముల్లా జారింది. కల్నలు గిరుక్కున తిరిగి వెళ్లిపోయాడు. మీనా అతని వెనకే వెళ్ళింది. షీలా సాంవరియా శవంమీద దుప్పటి కప్పింది.

యుద్ధం కొని తెచ్చుకున్నది. మానవత్వం పుట్టుకతో వచ్చింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments